సాహితీ సామ్రాజ్ఞి



చిత్తూరు రూరల్ (కాణిపాకం): సంధ్యా సమయాన.. సాహితీ తీరాన.. భాషా పరిమళాన్ని వెదజల్లుతున్నారు... తెలుగు సాహిత్యమే జీవన గమనంగా అడుగులేస్తున్నారు. ఈ రచనా ప్రస్థానంలో ఎన్నో అవార్డులు, రివార్డులను ఒడిసిపట్టారు వై.కె.సంధ్యాశర్మ. సందర్భానుగుణంగా కవితలతో అల్లుకుపోతూ, కథలతో మేల్కొలుపుతూ నేటి సమాజాన్ని ఆవిష్కరించే రచనా శైలి ఆమె సొంతం. చిత్తూరు నగరంలో సాధారణ గృహిణిగా ఉంటూనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అమ్మ ప్రోత్సాహంతో తొలి కవిత కాలేజీ మ్యాగజైన్ కోసం మొదలుపెట్టి.. ఆ తర్వాత తన జ్ఞాపకాలే అక్షర సంపదగా మార్చుకున్నారు. ప్రపంచ స్థాయి కథల పోటీల్లో ఆమె రచించిన **'వాసుకి, శిక్ష ఎవరికి, నల్ల కలువ'** కథలు ఎంపికయ్యాయి. తొలిసారి జిల్లా స్థాయి ఉగాది కవితల పోటీల్లో గెలుపొంది అప్పటి చిత్తూరు జిల్లా కలెక్టర్ రవిచంద్ర చేతుల మీదుగా **ఉగాది పురస్కారం** అందుకున్నారు. మరెన్నో కవితల, కథల పోటీల్లో బహుమతులు గెలుచుకున్నారు. గురజాడ, గిడుగు తెలుగు భాషా, గుర్రం జాషువా, సావిత్రీభాయి పూలే పురస్కారాలను అందుకున్నారు.





నిరక్షర దీపిక



ఐరాల: నేటి సమాజంలో తల్లిదండ్రులు ఒక్క బిడ్డను చదివించడానికే అష్టకష్టాలు పడుతున్న తరుణంలో.. భర్తను కోల్పోయి, పుట్టినిల్లు, మెట్టినిల్లు వారి సహకారం లేకపోయినా తాను చదువుకోకపోయినా తన ముగ్గురు ఆడబిడ్డలను ఉన్నతంగా చదివిస్తోంది ఈ మాతృమూర్తి. ఐరాల మండలం గూబలవారిపల్లె దళితవాడకు చెందిన నాగరాజ భర్త చంద్రమౌళి వ్యవసాయ కూలీ. వీరికి ముగ్గురు ఆడబిడ్డలు సంతానం. భర్త సంపాదనతోనే కుటుంబం గడిచిపోయేది. 13 ఏళ్ల క్రితం భర్త చంద్రమౌళి అనారోగ్యంతో మరణించాడు. వృద్ధులైన అత్తామామలతోపాటు ముగ్గురు ఆడబిడ్డలను ఎలా పోషించాలో తెలియక కుమిలిపోయింది. ఆ సమయంలో మూడో కుమార్తె రెండేళ్ల బిడ్డ. ఎలాగైనా సరే ఆడబిడ్డలను చదివించుకుని వారికి మంచి భవిష్యత్‌ను ఇవ్వాలని నిర్ణయించుకుంది. తాను వ్యవసాయ కూలీగా కొత్త జీవితం మొదలుపెట్టింది. ఆ పనుల్లేకపోవడంతో ఇప్పుడు భవన నిర్మాణ కూలీగా మారింది. ముగ్గురు ఆడబిడ్డలు డిగ్రీ, ఇంటర్, టెన్త్ చదువుతున్నారు. వారిని ఉన్నత స్థానంలో చూడాలని నాగరాజ తపనపడుతోంది.

క్లుప్తంగా

ఫుట్‌పాత్ ఆక్రమణలపై కొరడా

చిత్తూరు అర్బన్: నగర పాలక సంస్థ కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు నగరంలోని చర్చి వీధిలో ఫుట్‌పాత్ ఆక్రమణపై అధికారులు కొరడా ఝుళిపించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వ్యాపారం చేస్తున్న వారికి హెచ్చరికలు జారీ చేశారు. పరిమితి దాటవద్దని ఫుట్‌పాత్ ఆక్రమణలు వద్దని అసిస్టెంట్ సిటీ ప్లానర్ పి.నాగేంద్ర వ్యాపారస్తులకు సూచించారు.

ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

బంగారుపాళెం: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సురేంద్రబాబు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక స్టేట్‌బ్యాంక్, రత్నం మెమోరియల్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, డాక్టర్ జీషిత, రత్నం ఆస్పత్రి మేనేజర్ మోహన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అవని డిపాజిట్లను సద్వినియోగం చేసుకోవాలి

బంగారుపాళెం: మహిళలకు అందిస్తున్న అవని డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మేనేజర్ రాజుశ్రీవాత్సవ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అవని డిపాజిట్ పథకం అమలులో ఉంటుందన్నారు. కనిష్టంగా రూ.10 వేలు డిపాజిట్ చేయాలని సూచించారు. ఈ పథకం 333 రోజులు ఉంటుందన్నారు. పథకంపై మహిళలకు 8.30 శాతం వడ్డీ, సీనియర్ సిటిజన్ మహిళలకు 8.40 శాతం వడ్డీ అందివ్వనున్నట్లు తెలిపారు. డిపాజిట్లకు డీఐసీజీసీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు సహకార బ్యాంకులో సంప్రదించాలన్నారు.

సారా నిర్మూలనకు అందరి సహకారం అవసరం



మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

గుడిపాల: సారాను అరికట్టడానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి హరిరెడ్డి తెలిపారు. మండలంలోని రాసనపల్లెలో శుక్రవారం సారా రహిత రాష్ట్రం కోసం నవోదయం 2.0లో భాగంగా గ్రామ కమిటీలను ఏర్పాటుచేసి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నాటుసారా వల్ల జరిగే అనర్థాలను వారికి వివరించారు. గ్రామస్తులు, గ్రామ కమిటీలతో సారా వ్యాపారం నిలిపివేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో నిరుద్యోగంతో అధికసంఖ్యలో బాధపడుతున్నారని ప్రత్యామ్నాయం చూపాలని వారు కోరారు.

వడదెబ్బ నివారణకు జాగ్రత్తలు



గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో వడదెబ్బ సోకకుండా ఓఆర్‌ఎస్ ద్రావణం తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని ఐలవారిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 50 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

చిత్తూరు నగరంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ముందస్తుగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డీటీసీ నిరంజన్‌రెడ్డి కార్యాలయంలోని మహిళా ఉద్యోగులు, సిబ్బంది చేత కేక్ కట్ చేయించారు. అనంతరం వివిధ రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ సునీల్, ఎంవీఐలు దీపిక, రాజేశ్వరరావు, నరసింహులు, వాసుదేవరెడ్డి, ఏఓలు పురుషోత్తంరెడ్డి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

–చిత్తూరు రూరల్(కాణిపాకం)

ఇచ్చేవి తీస్కో.. లేనివి కొనుక్కో!

ఓ మహిళ అస్వస్థతకు గురైంది.. ఆమెను బంధువులు చిత్తూరు జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడి వైద్యుడు ఆమెను పరీక్షించి, మందులు రాసిచ్చారు. దీన్ని తీసుకుని వెళ్లి మందులు, ఇంజక్షన్లు ఇచ్చే విభాగంలో చూపారు. వారు కొన్ని మాత్రలు ఇచ్చారు. అయతే చీటీలో పది రాస్తే ఆరే ఇచ్చారేమని ప్రశ్నించారు. తరువాత వారికి అవి కూడా లేవని బదులిచ్చారు సిబ్బంది. అది విని వారు విస్తుపోయారు. ఇది వారి పరిస్థితే కాదు.. పలు వ్యాధులు.. చివరకు జ్వరాలతో వచ్చే వారికి కూడా మందులు తగ్గించి ఇచ్చి పంపుతున్నారు. అదేమని అడిగితే ఇచ్చేవి తీసుకో్కో.. లేనివి బయట కొనుక్కో.. అని సమాధానం చెబుతున్నారు. ఇదీ చిత్తూరు జిల్లాఆస్పత్రి దుస్థితి.



ప్రైవేటు షాపులో మందులు కొనుగోలు చేస్తున్న రోగులు

- జిల్లా ప్రభుత్వాస్పత్రిలో మందుల కొరత
- గ్లౌజులు, ఇంజక్షన్ల లేమి
- ఇన్సులిన్ నిల్
- అవస్థల్లో రోగులు
- సెంట్రల్ డ్రగ్స్‌లో అలసత్వమంటున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా ప్రభుత్వాస్పత్రిని మందుల కొరత వేధిస్తోంది. పేదలకు పెద్ద దిక్కు అయినటువంటి ఆస్పత్రిలో మందులు లేకపోవడంతో వైద్యులు రాసి ఇచ్చిన చీటీలు పట్టుకొని పేద ప్రజలు మందుల కోసం తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో నెలరోజులకు మందులు ఇవ్వగా ఇప్పుడు వారం రోజులకు, అదీ అరకొరగా ఇస్తున్నారు. దీంతో పేద రోగులు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. దీనికితోడు అస్పత్రుల్లో గ్లౌజులు, ఇంజక్షన్ల కొరత కూడా విపరీతంగా ఉంది. రెండు నెలలుగా ఇన్సులిన్ లేని పరిస్థితి దాపురించింది. దీంతో ఆస్పత్రికి వచ్చే పేద రోగులు అవస్థలు పడాల్సి వస్తోంది. జిల్లా ప్రభుత్వాస్పత్రికి నిత్యం ఓపీల సంఖ్య వెయ్యి దాటుతోంది. ఇన్‌పేషెంట్ల సంఖ్య 250 నుంచి 300 మంది వరకు ఉంటుంది. ఈ ఆస్పత్రికి చిత్తూరు వాసులతోపాటు చుట్టు పక్కల మండలాల వాసులు, కుప్పం, పలమనేరు నుంచి కూడా అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారు. అయితే వైద్యం అనంతరం ఇచ్చే మందులు, మాత్రలు, ఇంజక్షన్లు అందడం లేదు. దీంతో రోగులకు తీవ్ర నిరాశ ఎదురవుతోంది.

ప్రైవేటు షాపులకు వెళ్లాల్సిందే..

మందుల కొరత ఉండడంతో రోగులకు సరిపడా ఇవ్వడం లేదు. కొన్ని రకాల మందులు మాత్రమే ఇస్తున్నారు. మిగిలినవి ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఆస్పత్రిలో మొత్తం 1,500 రకాల మందులు అందుబాటులో ఉండేవి. నేడు కేవలం 500 రకాల మందులు కూడా లేవని వైద్య సిబ్బంది చెబుతున్నారు. క్షతగాత్రులకు కట్టుకట్టడానికి అవసరమైన మందులు, సూదులు, కిట్లు కూడా అందుబాటులో లేవు. ఎవరికైనా కట్టుకట్టాలంటే రోగులే బయట కిట్ కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. ఆస్తమా, చర్మ సంబంధిత వ్యాధులు, గ్యాస్ట్రిక్ తదితర వ్యాధులకు సంబంధించిన ఇంజక్షన్లు, మాత్రలకు ప్రైవేటు షాపులే దిక్కుగా మారుతున్నాయి.

ఇవీలేవు..

జిల్లా ప్రభుత్వాస్పత్రిలో హైడ్రో కోర్టిసోన్, డెరిఫిలిన్, అస్థలిన్, బుడేకార్ట్ సైతం లేవు. టాక్సిజిన్, సెపటాక్సిజిన్ ఇంజక్షన్లు అవసరం మేరకు లేవు. జెలుసిల్ సిరప్, అమోక్సీకావ్ యాంటిబయోటిక్, పాంటాప్‌లతో పాటు పలు రకాల మాత్రలు దొరకడం లేదు. పోలీ క్యాథెటర్, నెబులైజర్ మాస్క్, కాన్యూలాలు, బ్లడ్ గ్లూకోజ్ టెస్ట్ ట్రిప్స్ లేవని, బయట తీసుకోరమ్మని చెబుతున్నట్లు పలువురు రోగులు వాపోతున్నారు.

ఇన్సులిన్‌దీ అదేస్థితి

జిల్లా ప్రభుత్వాస్పత్రికి మధుమేహంతో నిత్యం 150 నుంచి 200 మంది వరకు రోగులు వస్తుంటారు. రెండు నెలలుగా ఆస్పత్రిలో ఇన్సులిన్ కొరత ఉంది. ఈ కారణంగా మిక్స్‌డ్ ఇన్సులిన్‌తోనే సర్దుతున్నారు. డాకర్లు మామూలుగా ప్లెయిన్ ఇన్సులిన్‌ను మాత్రమే రెఫర్ చేస్తున్నారు. అదీ ఆస్పత్రిలో దొరక్క బయట తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఒక్క యూనిట్ మార్కెట్‌లో కొనాలంటే సుమారు రూ.150 ఖర్చువుతోంది. అయితే అత్యవసరానికి మాత్రం ప్లెయిన్‌ను ఆస్పత్రి నిధులతో కొని అందుబాటులో ఉంచామని ఆస్పత్రి అధికారులు చెబుతున్నారు. సెంట్రల్ డ్రగ్స్ నుంచే ఈ ఇన్సులిన్ రావడం లేదని వారు అంటున్నారు.

గతంలో ఆరోగ్యానికి పెద్దపీట

గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యానికి పెద్దపీట వేశారు. రోగులకు అన్ని రకాల వైద్య సేవలు చేరువ చేశారు. వైద్యం పూర్తిగా అందించి కోలుకున్నాక.. మందులన్నీ ఇచ్చి మరీ పంపేవారు. ఇందుకోసం మొత్తం 1,500 రకాల మందులు అందుబాటులో ఉంచేవారు. పేదల ఆరోగ్యానికి గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రోగులకు చుక్కలు చూపిస్తోంది. ప్రభుత్వాస్పత్రుల్లో మందులు కూడా ఇవ్వలేని పరిస్థితులున్నాయి. మంచి రోజులు పోయి.. మందులు లేని రోజులు వచ్చాయంటూ రోగులు ఉసూరుమంటున్నారు.

మాత్రలు ఇవ్వకుంటే ఎలా?



పెద్దాస్పత్రికి వస్తే..మందులు ఒకటి ఉంటే రెండు ఉండదు. చీటిలో డాక్టర్లు రాసిచ్చే మందులు చాలా వరకు బయటే తీసుకోమంటారు. డబ్బులేదని ఈ ఆస్పత్రి వస్తే.. ఇక్కడ రూ.వందల్లో ఖర్చు పెట్టిస్తున్నారు. బయట కొనుక్కుమంటున్నారు. షుగర్ ఉందని వెళితే ఇన్సులిన్ లేదంటా. అది కూడా బయట తీసుకోమన్నారు. ఆస్పత్రి నమ్మి వచ్చే రోగులకు మంచి చేయాలని కోరుతున్నాను. **–కోదండరెడ్డి, తవణంపల్లి**

ఇబ్బంది లేకుండా చూస్తాం..



ఆస్పత్రిలో మందులు, మాత్రలు చాలావరకు ఉన్నాయి. లేనివి ఎప్పటికప్పుడు సెంట్రల్ డ్రగ్స్ నుంచి తెప్పిస్తున్నాం. ఒకవేళ లేకున్నా ఆస్పత్రి నిధుల నుంచి కొనుగోలు చేస్తున్నాం. కొరత ఎక్కువగా ఉందని తెలిస్తే విచారించి వెంటనే తెప్పించే ప్రయత్నం చేస్తాం. **–అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు**

నేడు మహిళా దినోత్సవ వేడుకలు

ఐరాల: మండలంలోని అగరంపల్లె జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, జిల్లా ఏపీజీఈఏ మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా ఏపీజీఈఏ అధ్యక్షురాలు భాగ్యమేరీ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మహిళలకు ఆటల పోటీలు, మధ్యాహ్నం 2 గంటలకు ముఖ్య అతిథుల సన్మానం నిర్వహిస్తామన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ ధనలక్ష్మి, కాణిపాకం వైద్యాధికారులు స్వాతి సింధూర, రాజేశ్వరి, ఐరాల సీడీపీఓ నిర్మల విచ్చేస్తారన్నారు. మహిళా ఉద్యోగులు, మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

నేడు, రేపు పన్ను చెల్లించవచ్చు

చిత్తూరు అర్బన్: నగరపాలక పరిధిలో 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నుల వసూలు కోసం నగరపాలక కార్యాలయంలో సెలవు రోజుల్లోనూ కౌంటర్లు పనిచేస్తాయని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ తెలిపారు. శని, ఆదివారాలు సెలవు రోజులైనప్పటికీ నేడు, రేపు నగరపాలక కార్యాలయంలోని పురసేవ కౌంటర్లు తెరిచే ఉంటాయన్నారు. ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆస్తి, నీటి, ఖాళీ జాగా పన్నులు చెల్లించడానికి వీలుగా అదనపు కౌంటర్లను ఏర్పాటు చేసి, అధికారులను నియమించినట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా నగర ప్రజలు తమ ఆస్తి, నీటి, ఖాళీ జాగా పన్నులను చెల్లించి నగరపాలక అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పశువ్యాధులపై అప్రమత్తం



గాలికుంటువ్యాధి టీకాలను వేస్తున్న అరీఫ్

గుడిపాల: వేసవిలో పశువులకు వచ్చే వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ డెప్యూటీ డైరెక్టర్ అరీఫ్ అన్నారు. బొమ్మసముద్రంలో శుక్రవారం గాలికుంటువ్యాధి టీకాలు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి టీకాలు నాలుగు మాసాల వయసు దూడల నుంచి అన్ని పశువులకు వేసుకోవచ్చన్నారు. 250 పశువులకు టీకాలను వేశారు. వేసవిలో చాలా అప్రమత్తంగా ఉండాలని పాడిరైతులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రవితేజ, సిబ్బంది కిషోర్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారి

తవణంపల్లె: మామిడి రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టినచో అధిక దిగుబడి సాధించవచ్చని బంగారుపాళ్యం ఉద్యానశాఖ అధికారి సాగరిక తెలిపారు. మండలంలోని స్వస్తిక్ నగర్‌లో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానశాఖ అధికారి సాగరిక మాట్లాడుతూ మామిడి పూత ఆశాజనకంగా రావడంతో చీడలు, పీడలు, బంక రాకుండా సకాలంలో మందులు స్ప్రే చేయాలన్నారు. దీని వల్ల మంచి దిగుబడి వస్తుందని సూచించారు. తవణంపల్లె వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ ఏపీడీ ఫజులున్నీసాబేగం, ఆర్‌ఎస్‌కె రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

వరసిద్ధునికి కూరగాయల వితరణ



కూరగాయలు అందజేస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానం నిత్య అన్నదానికి శుక్రవారం దాతలు కూరగాయలు వితరణ చేశారు. శాంతిపురానికి చెందిన దాతలు శ్రీనివాసులు, రవీంద్రారెడ్డి, వారి మిత్రబృందం సుమారు 2.5 టన్నుల కూరగాయలను ఆలయానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అన్నదానం ఇన్‌చార్జి గిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర హెచ్చరించారు. చిత్తూరు నగర పాలక కార్యాలయంలో శుక్రవారం ఆయన టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, లైసెన్స్ ఇంజినీర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ సంబంధించి లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే అక్రమ కట్టడాలను టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు వార్డుల్లో పర్యటించి గుర్తించి కట్టడి చేయాలని, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టి తీసుకురావాలన్నారు. అక్రమ కట్టడాలు, రోడ్ల ఆక్రమణలతో పాటు మున్సిపల్ స్థలాలు ఎక్కడైనా ఆక్రమణలకు గురైతే సంబంధిత సెక్రటరీలపై చర్యలు తప్పవన్నారు. టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏసీపీ శుభ ప్రద, సచివాలయం సిబ్బంది మరియు లైసెన్స్‌డ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

మండల స్థాయి సైన్స్ పోటీలు



విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండల కేంద్రంలో శుక్రవారం విద్యార్థులకు మండల స్థాయి సైన్స్ పోటీలను నిర్వహించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో పాలేరు ప్రాథమిక పాఠశాలకు చెందిన హర్షవర్ధన్ ప్రథమ వక్తృత్వ పోటీల్లో బంగారుపాళెం ప్రాథమిక పాఠశాలకు చెందిన హారిక, డ్రాయింగ్ పోటీలో చీకూరుపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన లవంత్ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు శనివారం నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ నాగేశ్వర్‌రావు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ధనంజయరాజు, సీఆర్‌పీలు సుశీల, ప్రేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పదవి వడ్డెర్లకు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెర్ల సంఘం నాయకులు

చిత్తూరు రూరల్ (కార్పొరేషన్): వడ్డెర్లకు ఎమ్మెల్సీ పదవి కల్పించాలని చిత్తూరు జిల్లా వడ్డెర సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చిత్తూరులో నగరంలోని పార్కులో శుక్రవారం వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రవీంద్ర రాజు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఇందులో ఒకటి వడ్డెర్లకు కేటాయించాలని చెప్పారు. ఎన్నికలకు ముందు చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో నిర్వహించిన యువగళం కార్యక్రమంలో వడ్డెర కులస్తులను చట్ట సభలకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవల్ల మురళికి ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం యువత అధ్యక్షులు హరిబాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫ్లవర్ గుర్రప్ప, ప్రధాన కార్యదర్శి రుద్రయ్య, మహిళ అధ్యక్షురాలు కుసుమ,రాష్ట్ర మహిళా కార్యదర్శి లావణ్య, దీప పాల్గొన్నారు.

సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ



మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

గుడిపాల: మండలంలోని రైతన్నలకు వసంతాపురం రైతుసేవా కేంద్రంలో శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వ్యవసాయాధికారి మాధవి వ్యవసాయంలో స్మార్ట్‌ఫోన్ ఉపయోగం, ఆధునిక సాంకేతికత, మొబైల్‌యాప్స్ ద్వారా వివిధ పంటల్లో వ్యాధులు, చీడపీడలు గుర్తించుట, మార్కెట్ ధరలు, వాతావరణ సమాచారం తెలుసుకోవడంపై వారికి వివరించారు. డిజిటల్ చెల్లింపులు, వాట్సాప్ గ్రూపు నిర్వహించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టెక్నికల్ అధికారి ఉమ పాల్గొన్నారు.



చీడపీడలను గుర్తించడంపై తెలియజేస్తున్న వ్యవసాయాధికారులు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చిత్తూరు - పూతలపట్టు :
95539 55610